# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం ఆరోపణల అంశంపై ఐదుగురు సభ్యులతో స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.
2. పట్టణాలలో మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణపై ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.
3. త్వరలోనే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.
4. రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల్ని పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.
5. పది రూపాయల నాణేలు చెలామణిలో ఉన్నాయని, వీటిని స్వీకరించవచ్చుని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు.

==========================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఆరోపణల అంశంపై సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని విచారించింది. ఐదుగురు సభ్యులతో స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం– సిట్‌ను ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ బృందంలో సీబీఐ నుంచి ఇద్దరు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు పోలీసు అధికారులు, భారత ఆహార భద్రతా ప్రమాణల సంస్థ –ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉండాలని సూచించింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ దర్యాప్తును చేపట్టాలని తెలిపింది.

ఇది ఇలా ఉండగా.. సిట్ బృందం ఏర్పాటును స్వాగతిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు.

-------------------------

పట్టణాలలో మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణపై ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాలలో మంత్రి ఈరోజు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటిని ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. నెల్లూరు నగరంలోని రహదారుల

విస్తరణ, మురుగు కాలువల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి.. ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో త్వరలోనే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నూతనంగా 9 కొత్త బస్సులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రెండు వందలకు పైగా నూతన బస్సులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభిస్తుందని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ ( 32 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల్ని పటిష్టంగా అమలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా చట్టం అమలుపై అమరావతిలోని సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆహార భద్రతా ప్రమాణాల్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన భారత ఆహార భద్రతా ప్రమాణల సంస్థ –ఎఫ్ఎస్ఎస్ఎఐతో అవహగానా ఒప్పందం చేసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో తాగునీటి ప్రమాణాల్ని నిరంతరం పర్యవేక్షించడానికి తగు చర్యలు చేపట్టాలని, ఆరోగ్య రక్షణ అధికారుల సంఖ్యను పెంచాలని సూచించారు.

---------------------------

పది రూపాయల నాణేలు చెలామణిలో ఉన్నాయని, వీటిని స్వీకరించవచ్చని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా –ఆర్బీఐ అధికారులు తెలిపారు. పదిరూపాయల నాణేలు చెల్లవు అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం వల్ల పదిరూపాయల నాణేల చెలామణి తగ్గిందని, పదిరూపాయల నాణెంపై ప్రజలు, వర్తకుల్లో అవగాహన తీసుకొచ్చే విధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి ఆర్బీఐ ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందని అధికారులు తెలిపారు. వీటిపై ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వ్యాపారుల్లో అవగాహన కలిపించేలా ప్రతి బ్యాంకు సిబ్బంది కనీసం పదిమంది వర్తకులను కలిసి పది రూపాయల నాణేలను అందజేయడమే కాకుండా “ఇక్కడ 10 రూపాయల నాణేలు స్వీకరించబడును” అని గోడ పత్రికలతో ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి ఆక్వా ఉత్పత్తులతో పాటు కూరగాయలు, పూలు వంటి ఉత్పత్తులను దేశంలో ఇతర ప్రాంతాలకు కార్గో సేవల ద్వారా రవాణా చేసేలా చర్యలు తీస్కుంటున్నామని రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో కార్గో సేవల విస్తరణకు సంబంధించి విజయవాడలో ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సురేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే ఐదు నౌకాశ్రయాలు, మూడు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయని, కొత్తగా కుప్పం, మూలపేట తదితర ప్రాంతాల్లో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కొత్త విమానాశ్రయాలు

అందుబాటులోకి వస్తే ప్రాంతీయ రవాణా సౌకర్యాలు పెరుగుతాయని తద్వారా సరకు రవాణా వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ ఉత్పత్తి సంస్థల ప్రతినిధులను కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సంస్థల ప్రతినిధులతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంధన రంగంలో పెట్టుబడులను పెట్టేలా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ విధానాన్ని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుందని తెలిపారు. విద్యుత్ రంగంలో అనేక సమస్యలను పరిష్కరించడంతో పాటుగా, దాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

---------------------------

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల పరిధిలోకి వచ్చే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో..రైల్వే జోనల్ మేనేజర్ విజయవాడలో ఈ రోజు సమావేశమైయ్యారు. ఈ సమావేశానికి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు డి. ప్రసాదరావు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, నరసారావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్‌లతో పాటు కడప పార్లమెంట్ సభ్యులు అవినాష్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డిలు హాజరయ్యారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన రైల్వే లైన్ల నిర్మాణం, కొత్త ప్రాజెక్టులపై పార్లమెంట్ సభ్యులు ఇచ్చే ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు.

---------------------------

ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రవాసాంధ్రులు అప్రమత్తంగా ఉంటూ స్థానికంగా జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ రెండు దేశాలకు ఎవ్వరూ వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. అక్కడున్న ప్రవాసాంధ్రుల సేవల కోసం 24 గంటలు కాల్ సెంటర్‌లో సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ-ఏపీఎన్ఆర్‌టీఎస్ తెలిపింది. సమాచారం కోసం 8682340678, 85000 27678 హెల్ప్ లైన్ నెంబర్లను లేదా helpline@apnrts.com ఈమెయిల్‌లలో సంప్రదించాల్సిందిగా కోరింది.

---------------------------

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గాయత్రి దేవి అలంకరణలో దర్శమిస్తున్న విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఈ రోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా దుర్గమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. భక్తులందరికీ సులభంగా అమ్మవారి దర్శనం కలిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు డి. ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులో మెగా ఉద్యోగ మేళాను ఆయన ఈరోజు

ప్రారంభించారు. అనంతరం ప్రసాదరావు మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నిరుద్యోగుల కోసం చిత్తూరు నగరంలో ఉద్యోగ మేళాను ప్రారంభించామని.. పార్లమెంటు పరిధిలోని మరికొన్ని ప్రాంతాల్లో ఈ మేళా నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఈ రోజు సాయంత్రం జరిగే ధ్వజారోహణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉండవల్లి నుంచి ఈ రోజు సాయంత్రం బయలుదేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం తిరుమల చేరుకొని బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకుని, ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు.తర్వాత మాడవీధుల్లో జరిగే పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. రేపు తిరుమలలో నూతనంగా నిర్మించిన వకుళమాత నూతన కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

======================